క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో టీడీపీ ముఖ్య నేతల చేరిక



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల: మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు సోదరులు ముగ్గురు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కొమ్మి సోదరులైన సిద్ధుల నాయుడు, రమేష్ నాయుడు, ప్రసాద్ నాయుడు తమ అనుచరులతో కలిసి కొమ్మి స్వగ్రామం పుల్లనీళ్లపల్లిలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన నేతలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. వ్యక్తిగతంగా వీరిని తన సోదరులుగా భావిస్తానని చెప్పారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

సోమశిల: అనంతసాగరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంఈఓ–1 బాలకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. అనంతసాగరం ఉన్నత పాఠశాల మొదటి స్థానం, సోమశిల ఉన్నత పాఠశాల రెండో స్థానం సాధించినట్లు సీడ్స్ సంస్థ ప్రతినిధి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 30న దుత్తలూరులో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు.

సంగంలో..

సంగం: సంగం జెడ్పీ హైస్కూల్‌లో సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీలత బుధవారం విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు ఉన్నత పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేశారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే క్విజ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఎన్‌ఎంయూ ధర్నా



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

ఆత్మకూరురూరల్: ఆర్టీసీకి సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఎన్‌ఎంయూ కార్మిక సంఘం బుధవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో డిపో కమిటీ, గ్యారేజీ కమిటీలకు చెందిన నాయకులు మస్తానయ్య, పద్మారావు, గౌస్‌బాషా, శ్రీహరి, అహమ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కల ప్రాశస్త్యాన్ని విద్యార్థినులకు వివరిస్తున్న ప్రిన్సిపల్, చైర్మన్ తదితరులు

ఆత్మకూరు: పర్యావరణాన్ని కాపాడడం అందరి విధి అని, ఇందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఏపీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ కె.సుగుణమ్మ అన్నారు. గురుకుల పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులు సుమారు 200కుపైగా మొక్కలు నాటారు. విద్యార్థినులు ప్రతి రోజు వాటిని సంరక్షించాలని, భావి తరాలకు మంచి పర్యావరణాన్ని అందించడం బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ మల్లికార్జున, పి రమేష్, ప్రిన్సిపల్ టి కామేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

అనుమసముద్రంపేట: మండలంలో బుధవారం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఏ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఏపీటీఎఫ్‌ను బాగా ఆదరించి ఎక్కువ మంది సభ్యత్వ నమోదులో పాల్గొన్నారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామసుబ్బారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఫణికుమార్, జిల్లా కౌన్సిలర్లు గణపతి, చల్లా శివకుమార్‌రెడ్డి, బి ప్రసాద్, మండల బాధ్యులు ప్రభుదాస్, సుబ్బరాయుడు, సుధాకర్‌రావు, మస్తానయ్య తదితరులు ఉన్నారు.

వరి విత్తనాల పంపిణీ

చేజర్ల: మిచాంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీతో వరి విత్తనాలు బుధవారం చేజర్ల ఆర్‌బీకేలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ శశిధర్, వీఏఏ మమత, రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక నిలయం.. పునర్వైభవం

పవిత్ర పినాకినీ తీరంలో కొలువైన ఆధ్యాత్మిక నిలయం.. సోమేశ్వరాలయం. చోళుల కాలంలో నిర్మితమై.. అలనాటి ప్రాచీన శిల్పకళా ప్రాభవాన్ని చాటుతూ అలరారుతున్న శైవక్షేత్రం. గంగాధరుడైన సోమేశ్వరుడు కొలువైన నిలయం. ఆ గంగ విలయధాటికి కకావికలమైన ఆలయానికి పునర్వైభవాన్ని తీసుకువచ్చే అంకురార్పణకు సిద్ధమైంది. ప్రాచీన ఆలయ వైభవాన్ని భావితరాలు గుర్తుంచుకునే రీతిలో ఆలయ పునర్నిర్మాణంతో పాటు పరిసరాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం జరిగింది.



సోమేశ్వరాలయం (ఫైల్)

- రూ.25 కోట్లతో ఆలయ నిర్మాణం, పర్యాటకాభివృద్ధి
- తొలి దశలో రూ.1.50 కోట్లతో గాలిగోపురం నిర్మాణం
- నేడు పునరుద్ధరణ పనులకు ఎమ్మెల్యే మేకపాటి శంకుస్థాపన

సోమశిల: హరిహరుడు.. గంగాధరుడు స్వరూపమైన సోమేశ్వరుడు కామాక్షి సమేతంగా కొలువైన ఆధ్యాత్మిక శైవక్షేత్రం సోమేశ్వరాలయం పునర్వైభవాన్ని సంతరించుకోనుంది. చోళుల కాలం నుంచి ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లిన సోమశిలలోని సోమేశ్వరాలయం ప్రకృతి ప్రకోపానికి విధ్వంసమైంది. 2020లో వచ్చిన నివర్ తుఫాన్ కారణంగా సోమశిల జలాశయానికి వచ్చిన లక్షలాది క్యూసెక్కుల వరద జలాలకు సోమేశ్వరాలయంలో నవగ్రహ మండపం, అమ్మవారి ఆలయం, గాలిగోపురం పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన సోమేశ్వరాలయం శిథిలాలు చూసి భక్తులు విచలితులయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అనేక మంది దేవాలయ పునరుద్ధరణ కోసం పరిశీలించారు. మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రాచీన దేవాలయ విశిష్టతను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆధ్యాత్మికత నెలవైన ఈ ఆలయాన్ని అలనాటి శిల్పకళతో పునరుద్ధరణ పనులతో పాటు పక్కనే ఉన్న సోమశిల జలాశయ పరిసరాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేలా చూడాలని విన్నవించారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి సోమేశ్వరాలయ పునరుద్ధరణ పనులకు దేవదాయశాఖ ద్వారా రూ.కోటి నిధులను మంజూరు చేశారు. కామన్ గుడ్ ఫండ్స్ కింద దాతల సహకారంతో మరో రూ.50 లక్షలు కలిపి మొత్తం రూ.1.50 కోట్లతో ఆలయ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఆలయ పూర్తి నిర్మాణం, పర్యాటకాభివృద్ధి చేసేందుకు సుమారు రూ.25 కోట్ల వరకు ఖర్చు కానున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న నిధులతో గాలిగోపురం నిర్మాణాన్ని చేపట్టే విధంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి డిజైన్లు రూపొందించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, దాతలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో చర్చించారు. వారందరూ సంపూర్ణ అంగీకారం తెలపడంతో ఆలయ పునరుద్ధరణ పనులకు గురువారం ఉదయం 8.45 గంటలకు శ్రీకారం చుట్టనున్నారు.

ఆలయ పునర్నిర్మాణం ఆనందకరం



కామాక్షి సమేత సోమేశ్వరస్వామి దేవస్థాన పునర్నిర్మాణం చేసేందుకు భూమి పూజ మహోత్సవ కార్యక్రమం జరగడం చాలా సంతోషంగా ఉంది. పరమేశ్వరుడి అనుగ్రహంతో ఆలయానికి మళ్లీ పూర్వవైభవం వచ్చేలా నిర్మాణానికి సాగడంతో పెన్నానది పరీవాహక ప్రాంత గ్రామ ప్రజలందరూ కూడా చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరికి కూడా సోమేశ్వరుడు కామాక్షిదేవి అనుగ్రహం ఉండాలని కోరుకుంటున్నాను.

– అన్నవరపు రామకృష్ణశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు



సోమేశ్వరాలయ గాలిగోపురం (ఫైల్)



దెబ్బతిన్న అమ్మవారి ఆలయం



వరదలకు దెబ్బతిన్న ఆలయ గాలిగోపురం

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- మేకపాటి రాజారెడ్డి

వరికుంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడప వద్దకే చేరుతుండటంతో, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త మేకపాటి రాజారెడ్డి అన్నారు. ఆయన బుధవారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, తూర్పుకొండారెడ్డిపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను విని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అందిస్తున్నది ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు చేపట్టారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలు 99 శాతం నెరవేర్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ప్రజలు గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు బేరీజు వేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరు చేసి ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్న పరిస్థితి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు. తొలుత ఆయన గ్రామంలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినయ్‌రెడ్డి, ఎంపీపీ జి.వెంకటలక్ష్మమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, మండల కోఆప్షన్ సభ్యుడు జిలానీబాషా, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు దొంతిరెడ్డి జయసింహారెడ్డి, మాగంటి శ్రీనివాసులు, సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి రామాంజనేయులు, జేసీఎస్ కన్వీనరు బొడ్డు వెంకటేశ్వర్లురెడ్డి, సొసైటీ డైరెక్టర్ జక్కం శ్రీనివాసులురెడ్డి, నాయకులు మందలపు తిరుపతినాయుడు, జి.రమేష్, యర్రా ఓబయ్య, ఆర్.మధుసూదన్‌రావు, బత్తిన కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.



గడప గడపలో బుక్‌లెట్‌లు అందిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ప్లాస్టిక్‌తో అనర్థాలు తప్పవు

- మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు

ఆత్మకూరు: ప్లాస్టిక్ కవర్లు, కప్పులు వేల ఏళ్ల తరబడి భూమిలో ఉన్నా కరగవని, వాటి వల్ల అనర్థాలు తప్పవని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు అన్నారు. అభ్యుదయ మహిళా మండలి సహకారంతో సచివాలయంలో ప్లాస్టిక్ నివారణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కమిషనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, కోటెడ్ కప్పులు వినియోగించడం వల్ల ప్రజల ఆరోగ్యం సైతం దెబ్బతింటుందన్నారు. పర్యావరణం దెబ్బతింటుందన్నారు. పర్యావరణ నెట్‌వర్క్ కన్వీనర్ విజయబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ అనర్థాలపై తమ సంస్థ తరఫున ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. త్వరలో ఆత్మకూరులో గుడ్డ సంచులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. తొలుత పలువురు మహిళలు, సచివాలయాల సిబ్బందితో ప్లాస్టిక్ నివారణపై ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా కళాకారులు ఎం.లీలమ్మ, స్వర్ణలత పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. అభ్యుదయ మహిళా మండలి అధ్యక్షురాలు జే జయలక్ష్మి, మున్సిపల్ ఏఈ ప్రసాద్, సచివాలయ శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ ఎస్‌కే నాయబ్‌రసూల్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, వైఎస్సార్ జిల్లాకు చెందిన ప్రీతి ఫౌండేషన్ నిర్వాహకుడు నాగార్జున, విశ్రాంత ఉపాధ్యాయుడు సాధిక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామీణ తపాలా ఉద్యోగుల నిరసన

ఆత్మకూరురూరల్: తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు బుధవారం మండలంలోని కరటంపాడు తపాలా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణ మాట్లాడుతూ తమ ఉద్యోగులకు సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని, 8 గంటల పనిభారం తగ్గించాలని, 12, 24, 36 అదనపు సర్వీసు ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కమలేష్‌చంద్ర కమిటీ సిఫారసు చేసిన బంచింగ్ అమలు చేయాలని, గ్రూపు ఇన్సూరెన్స్‌ను రెండున్నర లక్షలకు పెంచాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు లాలు మస్తాన్, ప్రేమ్‌కుమార్, హజరత్తయ్య, పి హజరత్తయ్య, నరసింహులు, ఖాజారసూల్, పెంచలయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

తపాలా ఉద్యోగుల ఆందోళన

ఉదయగిరి: దేశ వ్యాప్తంగా తపాలా ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం మండలంలోని గండిపాళెం తపాలా శాఖ కార్యాలయ సిబ్బంది ఆందోళన చేపట్టారు. గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. జీడీఎస్ ఉద్యోగులకు తపాలా శాఖ ఉద్యోగులు సహాయ సహకారాలు అందిచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గురుమూర్తి, రమణయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని వెంగళరావునగర్‌లో దుడ్డు వరలక్ష్మి ఇల్లు కాలిపోవడంతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆమెను పరామర్శించారు. కాలిపోయిన ఆమె ఇంటిని పరిశీలించి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. ఆమెకు భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, షేక్ అబ్దుల్లా, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కనుపర్తి రాజశేఖర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో పట్టుబడితే శిక్షలు తప్పవు

- డీఎస్పీ ఎన్ కోటారెడ్డి

ఆత్మకూరు: మత్తు పదార్థాలు తీసుకుంటే అనారోగ్యాలతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని, దీనికి తోడు వాటిని కలిగి ఉంటే శిక్షలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ ఎన్.కోటారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన నేతృత్వంలో పోలీసు సిబ్బంది, అనుమానితుల వద్ద బుధవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. వారం రోజులుగా పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీటి సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారిని గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ చెప్పారు.

భూ రీసర్వేకు సహకరించాలి

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం రెవెన్యూలో త్వరలో జరగనున్న భూ రీ సర్వేకు రైతులు సర్వే సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆయన బుధవారం గండిపాళెం రామాలయం వద్ద రీసర్వేకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతి రైతు వారి భూములకు సంబంధించిన పత్రాలను సర్వే సిబ్బందికి చూపించి సహకరించాలన్నారు. ప్రభుత్వమే ఉచితంగా సర్వే చేయడంతో పాటు హద్దులు ఏర్పరచి పాస్ పుస్తకాలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపల్లి కల్పన, పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, వీఆర్వో బిల్లుపాటి వెంకటేశ్వర్లు, సర్వేయరు రవి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



ఉదయగిరి: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ప్రజామిత్రమండలి ఆధ్వర్యంలో బుధవారం 40 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కనుమూరి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ చలికాలం దృష్టిలో ఉంచుకుని పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బకీరు జాషువా, బాలగురవయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లకు పింఛన్ కల సాకారం

కావలి నియోజకవర్గం



నా పేరు పెయ్యల మల్లయ్య. అల్లూరు ఆర్‌డీఆర్ కాలనీ. 75 ఏళ్లు వచ్చినా పింఛన్ కోసం గత ప్రభుత్వం హయాంలో టీడీపీ నేతల ఇళ్ల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి కాళ్లు అరిగిపోయాయి. అధికారుల దగ్గరకు పోతే జన్మభూమి కమిటీ నాయకుల దగ్గరకు వెళ్లమంటారు. జన్మభూమి కమిటీ నాయకుల దగ్గరకు పోతే అధికారులను కలమంటారు. ఇక ఈ జన్మకు నాకు పింఛన్ రాదని విసిగిపోయాను. టీడీపీ హయాంలో ఆరోగ్యం బాగున్నా.. లేకపోయినా.. పింఛన్ తీసుకునేందుకు రోజుల తరబడి లబ్ధిదారులు పడుతున్న కష్టాలు చూసి ఈ పింఛన్ కోసం ఇంతగా పాకులాడా అనిపించింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయాలు, వలంటీర్లను పెట్టడడంతో వాళ్లు మా ఇంటికి వచ్చి పింఛన్ మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు పెట్టుకున్న మొదటి సారే పింఛన్ మంజూరు అయిందంటూ వలంటీర్ మా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. ప్రతి నెల 1వ తేదీనే ఠంఛన్‌గా మా ఇంటికి వచ్చిన పింఛన్ డబ్బులు ఇస్తుంటే.. ఎంతో సంతోషంగా అనిపిస్తోంది. మంచి మనస్సున్న ముఖ్యమంత్రికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాను.

– అల్లూరు

జగనన్న సంక్షేమ పథకాలే ఆధారం

ఉదయగిరి నియోజకవర్గం



నా పేరు దావులూరి మాల్యాద్రి. మాది కొండాపురం మండలం గుడవళ్లూరు. గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎలాంటి పథకాలు అందలేదు. ఏమైనా పథకాలు ఉంటే జన్మభూమి కమిటీ సభ్యులు రానిచ్చేవారు కాదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిచినప్పటి నుంచి ప్రతి పథకం మా కుటుంబానికి అందుతోంది. నాకు ఇద్దరు మనుమరాళ్లు ఉన్నారు. ఇద్దరికీ జగనన్న అమ్మఒడి పథకం ప్రతి ఏటా అందుతోంది. నా భార్యకు 45 ఏళ్లు దాటిన మహిళలకు అందిస్తున్న రూ.18 వేల కూడా అందుతున్నాయి. గతంలో పంట నష్టపరిహారం కూడా అందింది. జగనన్న పక్కా ఇళ్లు మంజూరు చేశారు. ప్రతి సంవత్సరం రైతు భరోసా అందుతోంది. ఏడాదికి మా కుటుంబానికి రూ.లక్ష వరకు సంక్షేమ పథకాల ద్వారా డబ్బులు అందుతున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతి పథకాన్ని వలంటీరు మాకు అందిస్తున్నారు. రేషన్ బియ్యం బండి ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందుతున్నాయి. గ్రామ సచివాలయం ద్వారా తమ సమస్యలు అక్కడే పరిష్కారం అవుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే జగనన్న సంక్షేమ పథకాలే మా కుటుంబానికి ఆధారమయ్యాయి.



– కొండాపురం

అడిగిన వెంటనే నెరవేర్చిన సొంతింటి కల

ఆత్మకూరు నియోజకవర్గం



సొంతింటి ముందు తుమ్మల మహిత



నా పేరు తుమ్మల మహిత, నా భర్త పేరు మురళీకృష్ణ. మాది సంగం మండలం సిద్దీపురం కాలనీ. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. గ్రామంలో పది అంకణాల స్థలం గతంలో కొనుగోలు చేశాం. అప్పట్లో టీడీపీ ప్రభుత్వంలో సొంత ఇల్లు కట్టుకునేందుకు సహాయం చేయమని బతిమిలాడుకున్నా.. నాయకులు పట్టించుకోలేదు. జన్మభూమి కమిటీ వారిని అడగాలని తెలపడంతో వారి చుట్టూ తిరిగి తిరిగి మానుకున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సొంత ఇంటి నిర్మాణం కోసం గతేడాది సచివాలయం ద్వారా ప్రయత్నం చేశాం. ఎవరి రికమండేషన్ లేకుండానే ఇంటి నిర్మాణం కోసం రూ.1.85 లక్షలు మంజూరైంది. చీటీలు వేసుకుని కొంత నగదు, పొదుపు రుణం కొంత కలుపుకుని ప్రభుత్వం అందించిన నగదుతో సొంతింటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. ఈ ప్రభుత్వంలో అర్హతను చూసి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారు.

– ఆత్మకూరు/సంగం

అభివృద్ధి, సంక్షేమంలో అగ్రస్థానమే లక్ష్యం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి

చేజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను రాష్ట్రంలో ప్రజలందరూ ఆమోదిస్తున్నారని, నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో అగ్రస్థానంలో నిలవడమే లక్ష్యమని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని తూర్పుపల్లి సచివాలయ పరిధిలో పులనీళ్లపల్లిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు వెంకయ్యస్వామి మందిరంలో పూజలు చేశారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ పేదలందరిని ఆర్థికంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించి ఆచరణలో పెడుతున్నామన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచి ఏడాదిన్నర కాలంగా పలు గ్రామాల్లో నాయకులు, ప్రజలు తెలిపిన సమస్యలన్నింటిని పరిష్కరింటూ వస్తున్నానన్నారు. జగనన్న పాలన మెచ్చి పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని వారందరిని సాదరంగా ఆహ్వానిస్తున్నానన్నారు. అందరిని సమన్వయం చేసుకుంటూ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తూ జగనన్న సంక్షేమ పాలన ప్రజలకు అందించేలా ముందుకు సాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులు నాయుడు, వైస్ ఎంపీపీ తిరుపతి నాయుడు, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్ రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పి మనోహర్ రెడ్డి, తూర్పుపల్లి ఎంపీటీసీ గంగవరం కృష్ణారెడ్డి, పెళ్లేరు మాజీ సర్పంచ్ కొమ్మి సిద్ధుల నాయుడు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మెంబర్ ఎర్రగుంట పెంచలయ్య, మైనార్టీ నాయకులు షేక్ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి

వేడుకగా 'పోలి దీపం' మహోత్సవం

ఆత్మకూరు: పవిత్ర కార్తీక మాసం ముగిసిన మరుసటి రోజు పాడ్యమిని సందర్భంగా పోలి దీపం వెలిగించడం ఆనవాయితీ. పట్టణంలోని శివాలయం, చెరువు వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బుధవారం నీళ్లలో పోలి దీపాలు వెలిగించి వదిలారు. జేఆర్‌పేటలోని ఆండాళ్, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో పోలిదీప మహోత్సవాన్ని బుధవారం రాత్రి వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా సినీ సెట్టింగ్‌లతో కొలను, వెంకటేశ్వరస్వామి నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేసి పోలిదీప మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలతో ఆలయం కిక్కిరిసింది. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అరటి దొప్పలతో వెలిగించిన దీపాలను కొలనులో వదిలారు. మహిళలు సామూహికంగా దీపాలను కొలనులో వదిలారు. అనంతరం పోలి కథను అర్చకులు భక్తులకు వివరించారు.



ఆత్మకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో పోలి దీపాలను మహోత్సవంగా వదులుతున్న దృశ్యం

ప్రజల ముంగిటకే సంక్షేమ పాలన

ఉదయగిరి: సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రజా సంక్షేమ పాలన తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి అన్నారు. ఆయన బుధవారం మండలంలోని బిజ్జంపల్లిలో వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నవరత్నాలు ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. ఏపీలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రజలకు అండగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో గెలిపించుకుని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి చినబాబు, నాయకులు సుబ్బారెడ్డి, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు